అరెస్టు చేసి పోలీస్ వ్యాన్‌లో తరలిస్తుండగా నినాదాలు చేస్తున్న కేటీఆర్, హరీశ్‌రావును అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు, పోలీసుల వైఖరిని ప్రశ్నిస్తున్న కేటీఆర్, చెయ్యెత్తి నినదిస్తున్న కవిత. చిత్రంలో సత్యవతి రాథోడ్, పద్మారావుగౌడ్, ప్రశాంత్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, సుధీర్‌రెడ్డి తదితరులు

తొలిరోజే నిరంకుశం!

- అసెంబ్లీకి వెళ్లకుండా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అడ్డుకున్న పోలీసులు
- అదానీ, రేవంత్ బొమ్మలతో కూడిన టీ-షర్ట్స్‌ధరించడంపై అభ్యంతరం
- రోడ్డుపైనే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బైఠాయింపు.. అరెస్టులు
- తెలంగాణ వనరులను రేవంత్.. అదానీకి దోచిపెట్టే కుట్ర: కేటీఆర్
- అదానీపై ఢిల్లీలో రాహుల్ కుస్తీ.. రాష్ట్రంలో రేవంత్ దోస్తీ : హరీశ్‌రావు
- గన్‌పార్క్‌లో అమరులకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నివాళి

గన్‌పార్క్ వద్ద అమరవీరులకు నివాళులర్పిస్తున్న కేటీఆర్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు. చిత్రంలో మధుసూదనాచారి, హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, సబితా ఇంద్రారెడ్డి, గంగుల కమలాకర్, సునీతారెడ్డి, బండ ప్రకాశ్, శ్రీనివాస్‌గౌడ్, కవిత, దేశపతి శ్రీనివాస్, మల్లారెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, వివేకానంద, రవీందర్‌రావు, సంజయ్, రమణ, కౌశిక్‌రెడ్డి, విజయుడు, కాలేరు వెంకటేశ్, సుభాశ్‌రెడ్డి, తాతా మధు, చింతా ప్రభాకర్, లక్ష్మారెడ్డి, నవీన్‌రావు, అనిల్ జాదవ్ తదితరులు

హైదరాబాద్, డిసెంబర్ 9(నమస్తే తెలంగాణ): అసెంబ్లీ సమావేశాల తొలిరోజే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల పట్ల ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరించింది. వారిని అసెంబ్లీలోకి వెళ్లకుండా గేటు బయటనే అడ్డుకున్నది. సోమవారం దీక్షాదివస్‌లో భాగంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, గంగుల కమలాకర్, మల్లారెడ్డి, డాక్టర్ సంజయ్, ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, దేశపతి శ్రీనివాస్, కల్వకుంట్ల కవిత, ఎల్ రమణ తదితరులు గన్‌పార్క్‌లో తెలంగాణ అమరవీరులకు నివాళులు అర్పించారు. అనంతరం అసెంబ్లీకి హాజరయ్యేందుకు బయల్దేరారు. అసెంబ్లీ గేటు వద్ద భారీ సంఖ్యలో పోలీసులు, మార్షల్స్‌ను మోహరించిన ప్రభుత్వం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను లోనికి వెళ్లనివ్వలేదు. అదానీ-రేవంత్ మధ్య చీకటి బంధాన్ని తెలంగాణ ప్రజలకు తెలిపేలా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అదానీ, రేవంత్ ఫొటోలు ముద్రించిన టీ-షర్టులను ధరించగా, లోపలికి వెళ్లేందుకు పోలీసులు అభ్యంతరం వ్యక్తం చేశారు. తమకు నిరసన తెలిపే హక్కు లేదా? అని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పోలీసులను ప్రశ్నించారు. అయినా అనుమతించకపోవడంతో రోడ్డుపైనే నిరసనకు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అసెంబ్లీకి వెళ్లేందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, వారిని అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నించారు. దీంతో కొద్దిసేపు ఎమ్మెల్యేలకు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది.

పోలీసులతో కేటీఆర్, హరీశ్‌రావు వాగ్వాదం

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను, ఎమ్మెల్సీలను అసెంబ్లీలోకి వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులపై కేటీఆర్, హరీశ్‌రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అసెంబ్లీకి వెళ్లకుండా ఎమ్మెల్యేలను అడ్డుకోవడం ఏమిటని, తమ హక్కులను కాలరాయడమేనని అగ్రహం వ్యక్తంచేశారు. లోపలికి అనుమతించడం లేదో చెప్పాలని నిలదీశారు. ఈ ప్రజా ప్రభుత్వంలో నిరసన తెలిపే హక్కు లేదా? అని ప్రశ్నించారు. ఒకదశలో పోలీసులను తోసుకొని వెళ్లేందుకు ఎమ్మెల్యేలు ప్రయత్నించగా ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొన్నది. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పోలీసుల మధ్య తోపులాట జరిగి, గంటపాటు ఉద్రిక్తత కొనసాగింది. పరిస్థితి చేయిదాటిపోయే ప్రమాదం ఉండటంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అరెస్ట్ చేసి అక్కడి నుంచి తరలించారు.

తెలంగాణను అదానీకి దోచిపెట్టే కుట్ర: కేటీఆర్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ వనరులను, సంపదను అదానీకి దోచి పెట్టేందుకు కుట్రలు చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. సోమవారం అసెంబ్లీ ముందు ఆయన మాట్లాడుతూ.. రేవంత్-అదానీ అపవిత్ర కలయికపై, కుమ్మక్కు రాజకీయంపై నిలదీస్తూనే ఉంటామని స్పష్టంచేశారు. రాష్ట్రంలో అదానీకి అనుచితమైన లబ్ధి చేకూర్చే విధంగా రేవంత్ కుట్రలకు పాల్పడుతుంటే, ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తున్నదని చెప్పారు. కాంగ్రెస్, రాహుల్‌గాంధీ ఢిల్లీలో ఆదానీతో కొట్లాడుతున్నట్టు నాటకాలాడుతూ.. తెలంగాణలో మాత్రం ప్రాజెక్టులను, తెలంగాణ వనరులను అదానీకి దోచిపెట్టే కుట్ర చేస్తున్నారని విమర్శించారు.

రాహుల్ వెళ్లొచ్చు కానీ మమ్మల్ని వెళ్లనివ్వరా?

టీషర్ట్ వేసుకున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీకి వెళ్లకుండా అడ్డుకోవడంపై కేటీఆర్ మండిపడ్డారు. పార్లమెంటులో ఒక నీతి, శాసనసభలో ఒక నీతి ఎట్లా ఉంటుందని ప్రశ్నించారు. పార్లమెంటు ప్రొసీజర్స్ దేశమంతా ఒకే విధంగా ఉండాలని చెప్పారు. అసెంబ్లీ సమావేశాల మొదటిరోజే రోడ్డు మీద నిలబెట్టారని, ఇది దుర్మార్గమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్, ప్రియాంకతోపాటు 100 మంది ఎంపీలు అదానీ, ప్రధాని బొమ్మ గల టీషర్ట్ వేసుకొని పార్లమెంటు లోపలికి వెళ్లవచ్చు గానీ, తెలంగాణలో అసెంబ్లీ లోపలికి వెళ్లొద్దని అడ్డుకుంటున్నారని దుయ్యబట్టారు. అదానీపై కాంగ్రెస్ తీరు ఢిల్లీలో కుస్తీ.. గల్లీలో దోస్తీలా ఉన్నదని ఎద్దేవా చేశారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ సంధించే ప్రశ్నలకు సమాధానం చెప్పే దమ్ములేక.. పోలీసుల ద్వారా తమను అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. కేసీఆర్ దీక్ష చేయకపోయి ఉంటే డిసెంబర్ 9న తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ ప్రకటన వచ్చేదా? తెలంగాణ శాసనసభ, శాసనమండలి ఉండేదా? అని కేటీఆర్ ప్రశ్నించారు అదానీతో రేవంత్‌రెడ్డికి ఉన్న అక్రమ సంబంధాన్ని బయటపెడతామని స్పష్టంచేశారు. అదానీ-రేవంత్ మధ్య చీకటి ఒప్పందాలను అసెంబ్లీలో ప్రశ్నిస్తామంటే.. అసెంబ్లీ గేటు వద్దనే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అడ్డుకోవడం కాంగ్రెస్ ద్వంద్వ నీతికి నిదర్శనమని మండిపడ్డారు. స్పీకర్ ఆదేశాలతో పని లేకుండా ప్రభుత్వంలోని వ్యక్తులు ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా ఎమ్మెల్యేలను అరెస్ట్ చేయడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఆగ్రహం వ్యక్తంచేశారు.

ఢిల్లీకి రేవంత్ డబ్బుల సంచులు

అదానీతో సీఎం రేవంత్‌రెడ్డి అంటకాగడంపై, ఒప్పందాలు చేసుకోవడంపై కాంగ్రెస్ పార్టీ ఎందుకు మౌనంగా ఉంటున్నదని కేటీఆర్ ప్రశ్నించారు. ఈ మౌనానికి కారణం రేవంత్ ఢిల్లీకి పంపిస్తున్న డబ్బు సంచులేనని ఆరోపించారు. ఇప్పటికైనా రేవంత్‌రెడ్డి అదానీతో చేస్తున్న వ్యాపారాలపై కాంగ్రెస్ వైఖరిని స్పష్టంచేయాలని రాహుల్‌గాంధీని డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా రామన్నపేటలో వేల ఎకరాలను అదానీకి ధారాదత్తం చేసేందుకు స్థానిక ప్రజల అభిప్రాయాలతో సంబంధం లేకుండా ప్రజాభిప్రాయ సేకరణ చేసిన విషయాన్ని కేటీఆర్ గుర్తుచేశారు. అదానీకి భూములు కట్టబెట్టేందుకు రేవంత్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రేవంత్ విధానాలు, అరాచక పాలనకు వ్యతిరేకంగా పోరాడుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ సర్కార్ ఎన్ని నిర్బంధాలు పెట్టినా, దాడులు చేసినా బీఆర్ఎస్ పోరాటం ఆపబోదని స్పష్టంచేశారు.

అదానీ.. రాహుల్‌కు దొంగలా.. రేవంత్‌కు దోస్తులా : హరీశ్‌రావు

అదానీ వ్యవహారంలో ఢిల్లీ కాంగ్రెస్‌ది ఒక తీరు అయితే, గల్లీ కాంగ్రెస్‌ది మరో తీరుగా ఉన్నదని ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. ఢిల్లీ కాంగ్రెస్ అదానీ ఛోర్ హై అంటుంటే, గల్లీ కాంగ్రెస్ అదానీని భాయ్‌భాయ్ అంటున్నదని ఎద్దేవా చేశారు. రాహుల్‌గాంధీకి అదానీ దొంగలా కనిపిస్తుంటే, రేవంత్‌రెడ్డికి దోస్తులా కనిపిస్తున్నారని దుయ్యబట్టారు. ఇందులో ఎవరిది కరెక్ట్ అని ప్రశ్నించారు. ఒకే పార్టీలో నాయకుడిది ఒక తీరు.. రేవంత్‌రెడ్డిది ఒక తీరా? అని ప్రశ్నించారు. తాము అసెంబ్లీ లోపలికి వస్తే గతంలో అదానీతో చేసుకున్న రూ.12 వేల కోట్ల చీకటి ఒప్పందాలు బయటకొస్తాయనే భయమా? అని ప్రశ్నించారు. 'నువ్వు తప్పు చేసినవ్ కాబట్టే, మా గొంతు నొక్కుతున్నవ్' అంటూ మండిపడ్డారు. చీకటి ఒప్పందాలు, రహస్య బంధాలు ఎక్కడ బయటపడుతాయోననే భయంతోనే తమను ఆపుతున్నారని పేర్కొన్నారు. శాసనసభను ఏకపక్షంగా జరిపేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు.

పోలీసులను నిలదీస్తున్న మధుసూదనాచారి, హరీశ్, గంగుల, పల్లా, సుధీర్‌రెడ్డి

తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్సీలు సిరికొండ మధుసూదనాచారి, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

కాంగ్రెస్ పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ

- అసెంబ్లీలోకి ప్రతిపక్ష సభ్యుల అడ్డగింత అప్రజాస్వామికం
- ఈ చర్య చీకటిరోజు
- సీఎం ఒత్తిళ్లకు స్పీకర్ తలొగ్గొద్దు
- శాసనమండలిలో విపక్షనేత సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఫైర్

హైదరాబాద్, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నదని శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి ధ్వజమెత్తారు. చట్టసభల్లోకి ప్రతిపక్ష సభ్యులను రానీయకుండా అడ్డుకోవడం అప్రజాస్వామికమని విమర్శించారు. శాసనమండలిలో చైర్మన్, శాసనసభలో స్పీకర్ స్వతంత్రంగా వ్యవహరించాలని హితవు పలికారు. సీఎం రేవంత్‌రెడ్డి ఒత్తిళ్లకు తలొగ్గి పార్లమెంటరీ సంప్రదాయాలను అభాసుపాలు చేయొద్దని కోరారు. రేవంత్ ధనదాహం వెనుక అదానీ భూదాహం దాగి ఉన్నదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి విమర్శించారు. పార్లమెంట్ సాక్షిగా అదానీపై రాహుల్‌గాంధీ చేసిన నిరసన ఒప్పు అయినప్పుడు, తాము ఇక్కడ చేసింది తప్పెట్టా అవుతుందని నిప్పులు చెరిగారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో సోమవారం మాజీ మంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, కాలేరు వెంకటేశ్, విజయుడుతో కలిసి వారు మీడియాతో మాట్లాడారు. శాసనమండలి, శాసనసభల్లోకి ప్రధాన ప్రతిపక్ష సభ్యులను రానీయకపోవడం ప్రజాస్వామ్యానికే మాయనిమచ్చని, ఆ చర్య చీకటి రోజని సిరికొండ మధుసూదనాచారి వ్యాఖ్యానించారు. అదానీ విషయంలో రాహుల్ గాంధీ వైఖరికి, సీఎం రేవంత్‌రెడ్డి వైఖరి భిన్నంగా ఉన్నదని తెలిపారు.

తెలంగాణ సంపద అదానీకి దోచిపెట్టే కుట్ర: జగదీశ్‌రెడ్డి

అదానీకి తెలంగాణ సంపదను దోచిపెట్టేందుకే రేవంత్ కుట్ర పన్నుతున్నాడని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి విమర్శించారు. రామన్నపేటలో సిమెంట్ ఫ్యాక్టరీ, లగచర్లలో పరిశ్రమలు అదానీ కోసమేనని ధ్వజమెత్తారు. సీఎం రేవంత్‌రెడ్డి ధనదాహం వెనుక అధానీ భూదాహం దాగి ఉన్నదని తెలిపారు. ప్రభుత్వ వైఖరిని ఎండగట్టే క్రమంలో భాగంగా తాము తొలిరోజు అదానీ, రేవంత్ ఫొటోలు, స్టిక్కర్లున్న టీ-షర్టులను ధరించామని, టీ షర్టులు వేసుకోవడం నేరమన్నట్టు ప్రభుత్వం వ్యవహరించి అసలు తమను లోపలికే అనుమతి ఇవ్వకుండా అసెంబ్లీ గేటు బయటే పోలీసులు అరెస్టు చేయడం దుర్మార్గ చర్య అని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో రాహుల్‌గాంధీ ప్రధాని, అదానీ ఫొటోలనే కాకుండా ఏకంగా వారి మాస్క్‌లను ధరించి నిరసన తెలిపారని, అవే సంప్రదాయాలు ఇక్కడ ఎందుకు వర్తించవని ప్రశ్నించారు. అదానీపై రాహుల్ నిరసన తెలిపితే ఒప్పెట్ట? తాము అదే అదానీపై ఇక్కడ నిరసన తెలిపితే తప్పెట్ట? అవుతుందని ప్రశ్నించారు.

కేసీఆర్ దీక్షాఫలమే తెలంగాణ

ఎవరెన్ని కుట్రలు చేసినా, ఎన్ని కుయుక్తులు పన్నినా కేసీఆర్ ఆమరణ నిరాహారదీక్ష ఫలం తెలంగాణ అని సిరికొండ మధుసూదనాచారి, జగదీశ్‌రెడ్డి స్పష్టంచేశారు. అమరుల ఆత్మత్యాగాలు, తెలంగాణ ప్రజల అలుపెరుగని పోరాటం వల్లే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని తేల్చిచెప్పారు. డిసెంబర్ 9వ తేదీ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రకటన ఎలా వచ్చిందో దేశ ప్రజలందరికీ తెలుసని పేర్కొన్నారు. సమైక్యవాదులకు బానిసగా ఉంటూ తెలంగాణ వాదులపైకే తుపాకీ ఎక్కుపెట్టిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఈరోజు ఎన్నిమాటలు చెప్పినా ఎవరూ నమ్మరని చెప్పారు.

బతుకమ్మ బహజనుల పండుగ కాదు

వాళ్లు బతుకమ్మ ఆడలేదు, బోనాలే ఆడింద్రు

ఎమ్మెల్యే యెన్నం వ్యాఖ్యలు

హైదరాబాద్, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ): తెలంగాణ బతుకమ్మ బహుజనుల పండుగ కాదని, వారు పూర్వం నుంచి బతుకమ్మ ఆడనేలేదని కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. అసెంబ్లీ ముగిసిన అనంతరం మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. 'తెలంగాణ తల్లి విగ్రహంలో బతుకమ్మను తీసివేయడం వెనుక ఏమైనా కారణాలున్నాయా?' అని జర్నలిస్టులు అడిగిన ప్రశ్నలకు ఆయన పైవిధంగా స్పందించారు. 'మీకు చరిత్ర తెల్వదు. తెలంగాణ గ్రామాల్లో బహుజనులు బతుకమ్మ ఆడలేదు. బోనాలు ఆడింద్రు. హైదరాబాద్, రంగారెడ్డి చుట్టుపక్కల ప్రాంతాల్లో బహుజనులు అతిగా ఇష్టపడే పండుగ బోనాలు. వేల సంఖ్యలో పాల్గొనేవారు.

'యెన్నం' మాటలు వాస్తవమే: వీరేశం

హైదరాబాద్, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ): బతుకమ్మను బహుజనులు ఆడరనే అంశంపై ఎమ్మెల్యే వేముల వీరేశం కూడా మీడియా పాయింట్ వద్ద స్పందించారు. 'యెన్నం శ్రీనివాస్‌రెడ్డి చెప్పింది నిజమేనని, బహుజనులు బతుకమ్మ ఆడలేదని తెలిపారు. బహుజనులు బతుకమ్మ ఆడితే.. మా విమలక్క బహుజనుల బతుకమ్మ ఆడాల్సిన అవసరం ఉండేది కాదని పేర్కొన్నారు. నేను కూడా మాదిగ సామాజికవర్గం నుంచి వచ్చానని, మా జాతి మాంకాళమ్మ బోనాలు, ముత్యాలమ్మ బోనాలు ఎత్తింతి తప్పా.. ఏనాడూ బతుకమ్మ ఆడిన దాఖలాలు లేవని పేర్కొన్నారు. తెలంగాణకు బతుకమ్మ అవసరం, బోనాలు అవసరం. ఒక చేతిమీద బతుకమ్మను, బోనాన్ని పెట్టలేం కదా అని తెలిపారు. తెలంగాణ తల్లి ఏర్పాటు సందర్భంగా అమరువీరుల స్థూపాన్ని ఎందుకు అలంకరించలేదన్న ప్రశ్నకు.. 'అమరు వీరుల స్థూపానికి దండ వేయడానికి, అలంకరించుకోవడానికి ఇది అమరవీరుల దినోత్సవం కాదు కదా.. అని చెప్పారు.

అసెంబ్లీకి అడ్డగింతపై భగ్గుమన్న బీఆర్ఎస్

అదానీ, రేవంత్ బంధాన్ని బయటపెడితే నిర్బంధమా? • తెలంగాణ భవన్ వద్ద ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేల నిరసన

తెలంగాణ భవన్ ముందు ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు

హైదరాబాద్, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ): అదానీతో సీఎం రేవంత్‌రెడ్డి అంటకాగుతున్న వైనాన్ని శాసనసభ వేదికగా ఎత్తిచూపేందుకు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు సిద్ధమయ్యారనే విషయం తెలుసుకున్న ప్రభుత్వం అప్రమత్తమైంది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలను ఉభయసభల్లో అడుగుపెట్టకుండా అసెంబ్లీ గేటు ముందే అరెస్టు చేశారు. అనంతరం వారిని హైదరాబాద్ నగరంలోని పలు పోలీస్ స్టేషన్ల మీదుగా తిప్పుతూ తెలంగాణ భవన్‌లో విడిచిపెట్టారు. అక్రమ అరెస్టులకు నిరసనగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలో శాసనమండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు తెలంగాణభవన్ ముందు ప్లకార్డులను ప్రదర్శిస్తూ ఆందోళనకు దిగారు. సీఎం రేవంత్‌రెడ్డి విధానాలను ఎండగడుతూ చేసిన నినాదాలు ఆ పరిసరాల్లో మారుమోగాయి. కేటీఆర్‌తోపాటు మాజీ మంత్రులు హరీశ్‌రావు, గంగుల కమలాకర్, వేముల ప్రశాంత్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీలు కల్వకుంట్ల కవిత, దేశపతి శ్రీనివాస్, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, నవీన్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, విజయుడు తదితరులు పెద్దపెట్టున నినాదాలు చేశారు. దేశపతి శ్రీనివాస్ ఆలపించిన 'గోవిందా.. గోవిందా.. కల్యాణలక్ష్మి గోవిందా.. తులం బంగారం గోవిందా..' అంటూ.. కేసీఆర్ ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ పథకాలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎలా రద్దు చేసిందో పాట రూపంలో విమర్శనాత్మకంగా వినిపించారు. అలాగే 'తల్లి తెలంగాణమా.. తనువెల్లా మా గానమా.. వంటి ఉద్యమపాటలను ఆలపించారు. మాజీ మంత్రులు, ప్రజాప్రతినిధులు చప్పట్లు కొడుతూ ఉద్యమకాలం నాటి జ్ఞాపకాలను గుర్తుచేశారు. తెలంగాణ తల్లి విగ్రహం శిల్పశాస్త్ర ప్రకారం లేదని ఎమ్మెల్సీ సురభి వాణీదేవి పేర్కొన్నారు.

కాంగ్రెస్ తల్లిలానే విగ్రహం

- తెలంగాణ తల్లి విగ్రహంపై బీజేపీ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి
- ఎమ్మెల్యేలకు ప్రొటోకాల్ పాటించకపోవడంపై ఫైర్
- మంత్రితో రాకేశ్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి వాగ్వాదం

హైదరాబాద్, డిసెంబర్ 9(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం ఆవిష్కరించిన తెలంగాణ తల్లి విగ్రహం చూస్తుంటే.. కాంగ్రెస్ తల్లి అనే భావన కలుగుతున్నదని బీజేపీ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి అభిప్రాయం వ్యక్తంచేశారు. బతుకమ్మ లేకుండా తెలంగాణ తల్లి ఎలా ఉంటుందని ఆయన ప్రశ్నించారు. బతుకమ్మకు బదులుగా కాంగ్రెస్ గుర్తు 'హస్తం' చూపించేలా ఉన్నదని పేర్కొన్నారు. అందుకే ఆ విగ్రహం కాంగ్రెస్ తల్లి అనే భావన ప్రజల్లో కలుగుతున్నదని చెప్పారు. సోమవారం ఆయన అసెంబ్లీలో మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినప్పుడల్లా చిహ్నాలు, విగ్రహాలు మార్చుకుంటూ పోతే ఎలా అని ప్రభుత్వాన్ని నిలదీశారు. మంత్రి శ్రీధర్‌బాబుకు బీజేపీ ఎమ్మెల్యేలు రాకేశ్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి మధ్య ప్రొటోకాల్ వివాదం రచ్చగా మారింది. 'మీ కుర్చీలో కూర్చుంటేనే మీకు అంత ఇబ్బంది అయితే.. మరి మా నియోజకవర్గాల్లో మమ్మల్ని ఎమ్మెల్యేగా గుర్తించడం లేదు. అప్పుడు మాకెలా ఉంటుందో ఆలోచించండి' అంటూ కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ప్రొటోకాల్ అంశాన్ని ప్రస్తావించారు. తాను శాసనసభ సభ్యుడిని కాదా, ప్రజలు తనను గెలిపించలేదా, మరెందుకు ఎమ్మెల్యేగా తనకు ప్రొటోకాల్ ఇవ్వడం లేదని ఇదే అంశంపై ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి నిలదీశారు. ఐడీ కార్డును విసిరేసి అసహనం వ్యక్తంచేశారు.

సర్కారువి ఉల్టా ఆలోచనలు: పాల్వాయి

కాంగ్రెస్ ప్రభుత్వం అన్నీ ఉల్టా ఆలోచనలు చేస్తున్నదని బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ మండిపడ్డారు. అసెంబ్లీ సమావేశాల్లో తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు అంశంపై ఆయన మాట్లాడారు. రాష్ట్ర కాంగ్రెస్ మాత్రం కిరీటం తొలగించి సాదాసీదాగా రూపొందించిందని, బతుకమ్మ కూడా లేదని, ఉల్టా ఆలోచనలు చేస్తున్నదని విమర్శించారు. విగ్రహాలను ఏర్పాటు చేయడం, పేర్లు మార్చడం గాకుండా ప్రభుత్వం ఇకనైనా అభివృద్ధిపై దృష్టి సారించాలని చురకలంటించారు.

ప్రొటోకాల్ ఉల్లంఘన ఫిర్యాదు ఏమైంది?

తన నియోజకవర్గంలో మంత్రి, కలెక్టర్ ప్రొటోకాల్ ఉల్లంఘించారని 8 నెలల క్రితం ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు పట్టించుకోలేదని వెంకటరమణారెడ్డి సభ దృష్టికి తెచ్చారు. ఈ అంశంపై స్పీకర్ ప్రభుత్వానికి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి శ్రీధర్‌బాబు త్వరలోనే ప్రివిలేజ్ కమిటీ సమావేశం నిర్వహించాలని స్పీకర్‌ను కోరారు. ఈ అంశంపై తర్వాత చర్చిద్దామని తెలిపారు. దీంతో వెంకట్రామిరెడ్డి.. ప్రొటోకాల్ అంశంపై సభలో కచ్చితంగా చర్చించాల్సిందేనని పట్టుబట్టారు.

బతుకమ్మ ఉంటే బాగుండేంది: పాయల్

తెలంగాణ తల్లి విగ్రహంపై అన్ని పార్టీల అభిప్రాయం తీసుకుంటే బాగుండేదని బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అభిప్రాయం వ్యక్తంచేశారు. తెలంగాణ తల్లి తలపై బతుకమ్మ ఉంటే బాగుండేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక గేయం, చిహ్నం, విగ్రహాన్ని మార్చారని తెలిపారు. అన్నీ మారుస్తున్న సర్కార్.. ప్రభుత్వ ఉద్యోగులను ఇబ్బంది పెట్టే 317 జీవోను కూడా మార్చాలని కోరారు. నిర్ణయాలు తీసుకునే ముందు అందరి అభిప్రాయాలు తీసుకోవాలని సూచించారు.

ఒకే సభ పెడితే అయిపోతుండే!

ఒకేరోజు అసెంబ్లీ, విగ్రహావిష్కరణపై మంత్రుల నిట్టూర్పు

హైదరాబాద్, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ): 'పొద్దుగాళ్ల శాసనసభ.. సాయంత్రం విగ్రహావిష్కరణ సభ.. ఒక్కరోజే రెండు సభలు పెట్టుడు ఏందో అర్థమైతలేదు' అసెంబ్లీలో ఓ మంత్రి నిట్టూర్పు ఇది. సోమవారం ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాలు ప్రారంభించిన సంగతి తెలిసిందే. మరోవైపు సచివాలయంలో విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించింది. విగ్రహావిష్కరణ చేయాలని ఎప్పుడో నిర్ణయించగా, అసెంబ్లీ సమావేశాల ఆలోచన ఇటీవలే తెరమీదికి తెచ్చారని, హడావుడిగా నిర్వహించారని చర్చ జరుగుతున్నది. దీంతో కొందరు మంత్రులు అసంతృప్తి వ్యక్తంచేశారని సమాచారం. అధిష్ఠానం వద్ద తమ పరపతిని పెంచుకోవడానికి అసెంబ్లీ సమావేశాలు నిర్వహించడం ఏమిటని వ్యతిరేకించినట్టు చెప్తున్నారు. అసెంబ్లీ లాబీలో చిట్‌చాట్ సందర్భంగా ఓ మంత్రి ఇదే విషయంపై అసంతృప్తి వ్యక్తంచేశారు. సీఎంకు సలహాలు ఎవరిస్తున్నారో గానీ, ఒకేరోజు రెండు సభలు పెట్టుకోవడం, ఇంత హడావుడి పడటం ఎందుకు? అని అసహనం వ్యక్తంచేశారు.

అసెంబ్లీలో నిషేధాజ్ఞలు

హైదరాబాద్, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర శాసనసభలో గతంలో ఎన్నడూ లేనివిధంగా ఇప్పుడు కొత్త నిబంధనలు అమలుచేస్తున్నారు. శాసనసభ ఆవరణలో ఫొటోలు, వీడియోలు తీయడాన్ని నిషేధించారు. ఈ మేరకు శాసనసభ లాబీల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేశారు. ఉమ్మడి రాష్ట్రం నుంచి నిన్నమొన్నటి వరకు శాసనసభ ఆవరణలో ఎవరైనా, ఎప్పుడైనా ఫొటోలు, వీడియోలు తీసుకునే వెసులుబాటు ఉండేది. శాసనసభ సమావేశాలు జరుగుతున్న సమయంలో టీవీ చానళ్లు లైవ్